క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం



తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శుక్రవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు పవన్ తదితరలు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

వెంకన్నకు విశేషంగా అభిషేకం



వెంకన్నకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు రామానుజమ్

సింహాచలం: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం వేంకటేశ్వర స్వామికి పంచామృతాభిషేకం, అలివేలు మంగమ్మకు పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు రామానుజమ్ పూజలు నిర్వహించారు.

మొక్కల పెంపకం అవశ్యం



మొక్క నాటుతున్న అటవీ అధికారి రామ్‌నరేష్

సింహాచలం: భూమి బాగుంటేనే భవిష్యత్తు బాగుంటుందని అటవీ అధికారి బి.రామ్ నరేష్ తెలిపారు. సుజాతనగర్‌లోని రవీంద్రభారతి పాఠశాలలో నిర్వహించిన ధరిత్రీ వారోత్సవాలు శుక్రవారంతో ముగిసాయి. ముగింపు కార్యక్రమంలో పాల్గొన్న రామ్‌నరేష్ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు. పర్యావరణాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పాఠశాల ప్రిన్సిపాల్ స్వరూప చంద్రకళ , జోనల్ ఇన్‌చార్జి వెంకటేష్, జనరల్ మేనేజర్ రమ్య పాల్గొన్నారు.

ఉత్సాహంగా కబడ్డీ పోటీలు



క్రీడాకారులతో ప్రిన్సిపాల్ సీతాలక్ష్మి

పరవాడ: విశాఖ జిల్లా కబడ్డీ సంఘం ఆధ్వర్యంలో పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం కబడ్డీ పోటీలు నిర్వహించారు. జిల్లా కబడ్డీ సంఘ కార్యదర్శి జె.ఎ స్.వి.ప్రసాదరెడ్డి ఆదేశాల మేరకు నిర్వహించిన పోటీలను పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.సీతాలక్ష్మి ప్రారంభించారు. పోటీలు ఉత్సాహంగా సాగాయి. కార్యక్రమంలో జిల్లా కబడ్డీ సంఘ సంయుక్త కార్యదర్శి కె.లక్ష్మణరావు, పాఠశాల సీఈవో కె.నిశాంత్, రిఫరీ కె.భూలోక తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ వయసు పెంపుపై హర్షం

సింహాచలం: రాష్ట్ర దేవదాయశాఖ ఉద్యోగుల పదవీ విరమణ వయసు 60 నుంచి 62 ఏళ్లకు పెంచుతూ కేబినెట్ సమావేశంలో తీసుకున్న నిర్ణయంపై శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానం వైఎస్సార్ ఉద్యోగుల అసోసియేషన్ అధ్యక్షుడు సిరిపురపు మహేశ్వరరావు, ఉపాధ్యక్షుడు ఎంకెవీవీఎన్ యాజులు శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. కేబినెట్ తీసుకున్న నిర్ణయం రిటైర్డ్ కాబోతున్న చాలా మంది ఉద్యోగుల కళ్లల్లో ఆనందం నింపుతుందని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి, దేవదాయశాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ, ఐటీశాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్



రావాడలో లబ్ధిదారులకు ధ్రువ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. మండలంలో రావాడ, కలపాక గ్రామాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. రాష్ట్ర ప్రజలకు సంక్షేమ పథకాలతో పాటు విలువైన సేవలను దరిచేర్చాలన్న లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని చెప్పారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో ఉచితంగా 11 రకాల సేవలు అందిస్తున్నట్టు తెలిపారు. జగనన్న ప్రభుత్వం పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తుందన్నారు.

పట్టాలిచ్చిన తర్వాతే మళ్లీ వస్తా..

రావాడ గ్రామంలో ఇళ్ల పట్టాల సమస్యను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఇళ్ల పట్టాలు అందించిన తర్వాతే మళ్లీ ఓటు అడగడానికి ప్రజల వద్దకు వస్తానని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ అన్నారు. రావాడ గ్రామంలో వివిధ రకాల సర్టిఫికెట్ల కోసం ప్రజల నుంచి 1800 దరఖాస్తులు అందగా వాటిలో సిద్ధం చేసిన 1429 ధ్రువ పత్రాలను ఎమ్మెల్యే లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, తహసీల్దారు పి.కనకారావు, వైస్ ఎంపీపీలు బి.నాగేశ్వరరావు, బి.అప్పలరాజు, రావాడ సర్పంచ్ మోటూరి సన్యాసి నాయుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు పాల్గొన్నారు.

- కలపాకలో సర్పంచ్ బొండా కనకారావు ఆధ్వంలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. కలపాకలో 814 ధ్రువపత్రాలు, పి.బోనంగిలో 450 ధ్రువపత్రాలను ఎమ్మెల్యే అదీప్‌రాజ్ లబ్ధిదారులకు అందజేశారు.



కలపాకలో లబ్ధిదారులకు ధ్రువ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



అర్హులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రాపురం సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష తదితరులు

88వ వార్డులో..

జీవీఎంసీ 88వ వార్డు పరిధి నరవ, కోటనరవ, సతివానిపాలెం, వెదుళ్ల నరవ సచివాలయాల పరిధిలో జగనన్న సురక్ష కార్యక్రమాన్ని నరవ సచివాలయంలో శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమం, రాష్ట్రాభివృద్ధి రెండు కళ్లుగా చేసుకుని పాలన చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పలువురికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో 88వవార్డు ఇన్‌చార్జి గంగ్రెడ్డి మహాలక్ష్మినాయుడు, వార్డు నాయకులు సర్వసిద్ధి బొర్రయ్య, మళ్ల నూక అప్పారావు, చట్టి తాతారావు, ఎస్. గురుమూర్తి, ఎ.శ్రీను, ఆళ్ల సత్య అప్పారావు, జెడ్సీ సింహాచలం పాల్గొన్నారు.

రాంపురంలో..

సింహాచలం: అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు, 11 రకాల సర్టిఫికెట్లు అందజేయడమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని రాంపురం సర్పంచ్ అన్నంరెడ్డి శిరీష తెలిపారు. పెందుర్తి మండలం రాంపురంలో శుక్రవారం జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. శిరీష మాట్లాడుతూ 1286 మందికి సర్టిఫికెట్లు అందజేసి రికార్డు సాధించామన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఉషారాణి, ఎంపీపీ మధుపాడ నాగమణి, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, జెడ్పీటీసీ ఉప్పిలి దేవి, తహసీల్దార్ శ్యాంప్రసాద్, ఎంపీడీవో వసంత, ఏవో వెంకటరావు, పంచాయతీ సెక్రటరీ పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు ఆదేశాలు అమలయ్యేలా చర్యలు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలో ముత్యాలమ్మపాలెం మత్స్యకారులకు ఉపాధి కల్పించాలని హైకోర్టు ఇచ్చిన ఆదేశాలు త్వరితగతిన అమలు అయ్యేలా చూస్తామని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ హామీ ఇచ్చారని గ్రామ సర్పంచ్ చింతకాయల సుజాత ముత్యాలు చెప్పారు. ఈ మేరకు మత్స్యకారుల ఉపాధిపై హైకోర్టు జారీ చేసిన ఆర్డర్ ప్రతులను ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌కు శుక్రవారం క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మిశ్రీనివాసరావు, నాయకులు బొంది అచ్చిబాబు, మండల కోఆప్షన్ సభ్యుడు ఎం.అప్పన్న, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, సూరాడ ముత్యాలరావు, బొద్దపు చిన్నారావు పాల్గొన్నారు.

విద్యార్థి అదృశ్యం

పరవాడ: ముత్యాలమ్మపాలెం గ్రామానికి చెందిన సూరాడ మహేశ్వరి అదృశ్యమైనట్లు తండ్రి సూరాడ మసేను శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. వివరాలు.. మహేశ్వరి తిక్కవానిపాలెంలో మేనత్త వద్ద ఉంటూ పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతుంది. గురువారం ఉదయం 8 గంటల సమయంలో కళాశాలకు వెళ్తున్నానని చెప్పి ఆటోలో ఇంటి నుంచి వెళ్లిన ఆమె ఇంటికి చేరలేదు. కళాశాల యాజమాన్యాన్ని విచారించగా కాలేజీకి రాలేదని చెప్పడంతో బంధువులు, స్నేహితులను వాకబు చేసినా ఆచూకీ లభించలేదు. విద్యార్థి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ పి.ఈశ్వరరావు చెప్పారు.

రైతులకు అందుబాటులో ఉండాలి



సమావేశంలో రామారావు

పరవాడ: ఖరీఫ్ సీజన్‌లో వరి పండించే రైతులకు అవసరమైన సలహాలు, సూచనలు అందజేయడానికి వ్యవసాయ అధికారులు అందుబాటులో ఉండాలని మండల వ్యవసాయ సలహా కమిటీ ఛైర్మన్ కోన రామారావు సూచించారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన సలహా కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. బిందు, తుంపర సేద్యానికి అవసరమైన పరికరాలు రాయితీపై అందజేయడానికి సిద్ధంగా ఉన్నాయన్నారు. మండల వ్యవసాయాధికారి సీహెచ్ చంద్రావతి మాట్లాడుతూ వరి నారు మళ్లు వేయడానికి వాతావరణం అనుకూలంగా ఉందన్నారు. వరి విత్తనాలు తీసుకోలేని రైతులు ఆర్‌బీకే కేంద్రాల్లో విత్తనాలను పొందవచ్చునన్నారు. సమావేశంలో వ్యవసాయ విస్తరణాధికారి మాసవరపు నరసింహమూర్తి, రైతులు అయ్యబాబు, అప్పారావు పాల్గొన్నారు.

చంద్రయాన్ -3 విజయవంతం కావాలని ర్యాలీ



ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కేజీబీవీ విద్యార్థులు

సబ్బవరం: చంద్రయాన్-3 విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ సబ్బవరం కేజీబీవీ విద్యార్థులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. కేజీబీవీ ఎస్‌వో మృదుల చంద్రయాన్ -3 లక్ష్యాన్ని విద్యార్థులకు వివరించారు. విజయవంతంగా నిర్దేశించిన గమ్యం చేరుకోవాలని ప్లకార్డులు ప్రదర్శించారు. కేజీబీవీ నుంచి సబ్బవరంలోని మూడు రోడ్ల కూడలి వరకూ ర్యాలీ నిర్వహించారు.

పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే వేటు

- సింహాచలం, ఎర్ర నాగరాజును సస్పెండ్ చేస్తాం
- మిగిలిన వారికి షోకాజ్ నోటీసులు
- ఎమ్మెల్యే అదీప్‌రాజ్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: వైఎస్సార్‌సీపీకి నష్టం చేసే కార్యక్రమాలకు పాల్పడే వారిని పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ హెచ్చరించారు. పెందుర్తి మండలం గుర్రంపాలెంలో శుక్రవారం రాత్రి ఆయన మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడిగా పంచకర్ల రమేష్‌బాబు రాజీనామా చేయడంతో పార్టీతో ఆయనకు సంబంధం ఉండదన్నారు. అయినా పెందుర్తిలో పంచకర్ల రమేష్‌బాబు శుక్రవారం నిర్వహించిన ఆత్మీయ సమావేశానికి పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు వెళ్లినట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వ్యతిరేకంగా మాట్లాడిన కొందరికి మద్దతు ఇచ్చినట్టు తన దృష్టికి వచ్చిందన్నారు. సమావేశానికి వెళ్లిన వైఎస్సార్‌సీపీ నాయకులు అయిత సింహాచలం, ఎర్ర నాగరాజులను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తామన్నారు. వారికి, వైఎస్సార్‌సీపీకి ఎలాంటి సంబంధం ఉండదన్నారు. అలాగే సమావేశానికి వెళ్లిన పలువురు నాయకులతో మాట్లాడానని, వారికి కూడా షోకాజ్ నోటీసులు జారీ చేస్తామని వారి వివరణ తర్వాత అవసరమైన చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ చెప్పారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు నక్క కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

పెదనాయుడు పాలెంలో సురక్ష సర్వే



సర్వేను ప్రారంభిస్తున్న నాయకులు

సబ్బవరం: మండలంలోని సబ్బవరం సచివాలయం -3 పరిధిలో ఈ నెల 19న జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నారు. దీనిలో భాగంగా పెదనాయుడుపాలెం గ్రామంలో సర్వేను జగనన్న సురక్ష నియోజకవర్గ ఇన్‌చార్జి కొటాన రాము శుక్రవారం ప్రారంభించారు. వారం రోజుల పాటు పలు సంక్షేమ పథకాలకు,ప్రభుత్వ సేవలకు అర్హత కలిగిన లబ్ధిదారులను సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి గుర్తిస్తారని చెప్పారు. కార్యక్రమంలో మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాల నాయుడు, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, సచివాలయ కన్వీనర్ సబ్బవరపు నాగభూషణం,సబ్బవరపు సత్యనారాయణ, వార్డు మెంబర్లు గొర్లి శ్రీనివాసరావు,సబ్బవరపు శివ, బొడ్డు నగేష్‌తో పాటు సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

పోలీసులు దృఢంగా ఉంటే ప్రజలకు మెరుగైన సేవలు



గౌరవ వందనం స్వీకరిస్తున్న సీపీ త్రివిక్రమ్ వర్మ

దొండపర్తి (విశాఖ దక్షిణ): పోలీసులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉంటే ప్రజలకు మెరుగైన సేవలు అందించగలుగుతారని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సి.ఎం.త్రివిక్రమ్ వర్మ పేర్కొన్నారు. శుక్రవారం ఆర్మ్‌డ్ రిజర్వ్ మైదానంలో పోలీస్ సిబ్బంది చేసిన కవాతును సీపీ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను కవాతుపై ప్రత్యేక శ్రద్ధ చూపుతానని, 8వ బెటాలియన్‌లో ఉన్నపుడు పరేడ్‌కు మరింత ప్రాధాన్యత ఇచ్చేవాడినన్నారు. 2006లో రాష్ట్ర స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పరేడ్ కమాండర్‌గా చేయడం కారణంగా తనకు కవాతుపై పూర్తి అవగాహన ఉందని తెలిపారు. ఏఆర్ సిబ్బంది చేసిన కవాతును, టర్న్ ఔట్‌ను అభినందించారు. ఏఆర్ సిబ్బంది బందోబస్తుల కంటే ఎక్కువగా ప్రిజన్ ఎస్కార్ట్ డ్యూటీలు, గార్డు డ్యూటీలు, వీఐపీ ఎస్కార్ట్‌లు నిర్వహిస్తున్నారన్నారు. ఇప్పటి వరకు ఎటువంటి ఫిర్యాదులు లేకుండా చక్కగా విధులు నిర్వర్తిస్తున్నారని ప్రశంసించారు. రాష్ట్ర డీజీపీ కె.వి. రాజేంద్రనాథ్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి శుక్రవారం సిబ్బంది సంక్షేమ దివాస్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సిబ్బందికి శాఖాపరమైన అంశాలలో ఏదైనా సమస్య ఉంటే నెలలో కచ్చితంగా ఒక శుక్రవారం గ్రీవెన్స్ నిర్వహిస్తామని వివరించారు. సిబ్బంది సంక్షేమానికి పెద్దపీట వేస్తామని, ఏదైనా సమస్య ఉంటే తమ దృష్టికి తీసుకువస్తే దాని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీసీపీ-1 విద్యాసాగర్‌నాయుడు, ఏడీసీపీ(అడ్మిన్) ఎం.ఆర్.కె.రాజు, ఏడీసీపీ(ఎస్‌బీ) ఇ.నాగేంద్రుడు, ఏడీసీపీ(ఏఆర్) కె.సుబ్రహ్మణ్యం, ఏసీపీలు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

రేపు ఉచిత ఆధార్, ఈ శ్రమ్ కార్డు క్యాంపు

గాజువాక : గాజువాక లయన్స్ క్లబ్, ప్లానెట్ 9 సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 16న ఉచిత ఆధార్, ఈ శ్రమ్ కార్డు క్యాంపులను నిర్వహించనున్నట్టు లయన్స్ క్లబ్ ప్రతినిధులు సత్యాల కోటేశ్వరరావు, బలివాడ సత్యారావు తెలిపారు. ఆదివారం ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు శిబిరం కొనసాగుతుందని తెలిపారు. ఈ శిబిరంలో ఐదేళ్ల లోపు పిల్లలకు ఉచితంగా ఆధార్ నమోదు చేస్తారన్నారు. ఈ శ్రమ్ కార్డు చేయించుకోదలచినవారు తమ బ్యాంక్ పాస్ బుక్‌ను తీసుకురావాలని సూచించారు. వివరాల కోసం 9989087875 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఉక్కు దీక్షలకు కాంగ్రెస్ నాయకుల సంఘీభావం



దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకుడు వెంకటేష్

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిశ్రమ అమ్మకపు ప్రతిపాదనను తక్షణమే వెనక్కి తీసుకోవాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షల్లో 883వ రోజుకు చేరుకున్నాయి. శుక్రవారం దీక్ష శిబిరంలో కాంగ్రెస్ నాయకులు వేగి వెంకటేష్, సిటీ కాంగ్రెస్ అధ్యక్షుడు గొంప గోవింద్, రాష్ట్ర యూత్ అధ్యక్షుడు లక్కరాజు రామారావు తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు. వేగి వెంకటేష్ మాట్లాడుతూ ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని కేంద్రప్రభుత్వం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో కాంగ్రెస్ పార్టీ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు ప్రత్యక్ష ఆందోళనకు దిగుతుందన్నారు. త్వరలోనే రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు ఉక్కు పరిరక్షణ కోసం పాదయాత్ర చేస్తారని, కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకుడు రాహుల్ గాంధీ ఉక్కు పరిరక్షణ కోసం విశాఖ వస్తారని తెలిపారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

తాడి గ్రామం తరలించడానికి చర్యలు

- ఎమ్మెల్యే అదీప్‌రాజ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పరవాడ: ఫార్మా కాలుష్యంలో చిక్కుకున్న తాడి గ్రామ తరలింపు కోసం ప్రభుత్వం అన్ని చర్యలు చేపట్టిందని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ చెప్పారు. దలాయిపాలెంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో తాడి తరలింపుపై శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామం తరలింపు కోసం సిద్ధం చేసిన స్థలంలో జంగిల్ క్లియరెన్స్ పనులు, సర్వే పూర్తి చేసి ఒక్కో కుటుంబానికి 5 సెంట్ల స్థలం కేటాయిస్తూ లేఅవుట్లను సిద్ధం చేయాలని రెవెన్యూ అధికారులకు ప్రభుత్వం ఆదేశాలిచ్చిందన్నారు. తాడి తరలింపు కోసం అవసరమైన నిధులు కేటాయిస్తూ త్వరలో ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు వచ్చే అవకాశం ఉందన్నారు. ఈ విషయమై సీఎంవో అధికారులతో చర్చించినట్టు తెలిపారు. అనంతరం తాడి గ్రామ ప్రజలు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, తహసీల్దారు పి.కనకారావు, ఎం.ఎస్.ఎం.ఈ డైరెక్టర్ దలాయి నదీయా, మాజీ సర్పంచ్ పితాని నీలకంఠరావు, రమణ, గోవిందరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'జగనన్న సురక్ష'తో సత్వర న్యాయం



పినగాడిలో సర్టిఫికెట్లు అందజేస్తున్న సర్పంచ్ వరలక్ష్మి, తదితరులు

సింహాచలం: జగనన్న సురక్ష ద్వారా అర్హులందరికీ సత్వర న్యాయం జరుగుతుందని 8వ జోన్ జెడ్సీ మల్లయ్య నాయుడు తెలిపారు. అర్హులైనవారందరికీ ప్రభుత్వ పథకాలు, 11 రకాల సర్టిఫికెట్లు అందజేయడమే జగనన్న సురక్ష కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. 93వ వార్డు ప్రహ్లాదపురంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. పలువురికి సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో 93వవార్డు వైఎస్సార్ సీపీ నాయకులు దాసరి సత్తిబాబు, దాసరి అన్నపూర్ణ, బండి సత్తిబాబు, జేసీఎస్ కన్వీనర్ జోబ్ దాస్, శ్రీరామ్ పాల్గొన్నారు.

- అర్హులైన వారందరికీ 11 రకాల సర్టిఫికెట్లు అందించేందుకు జగనన్న సురక్ష కార్యక్రమం దోహదపడుతుతుందని పినగాడి సర్పంచ్ బైలపూడి వరలక్ష్మి అన్నారు. పెందుర్తి మండలం పినగాడిలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలోజేసీఎస్ కన్వీనర్ నక్క కనకరాజు, పార్టీ సీనియర్ నాయకుడు బైలపూడి భగవాన్‌జయరామ్, డీఆర్‌డీఏ పీడీ ఉషారాణి, పెందుర్తి తహసీల్దార్ శ్యాంప్రసాద్, ఈవోఆర్‌డీ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



సుప్ర వెహికల్‌లోని స్క్రీన్‌పై ప్రమాదాల గురించి తెలియజేస్తున్న ఎస్ఐ రమేష్

సింహాచలం: ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షిత ప్రయాణం సాగించాలని పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ తెలిపారు. సుప్ర వెహికల్ ద్వారా శుక్రవారం పెందుర్తి కూడలిలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ట్రాఫిక్ రూల్స్ పాటించకపోవడం వల్ల గతంలో చోటుచేసుకున్న రోడ్డు ప్రమాదాల గురించి స్క్రీన్‌పై చూపించారు. చిన్నపొరపాటు ప్రాణాలను హరిస్తుందని తెలియజేశారు. ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలని సూచించారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్ ప్రమాదకరమని, సిగ్నల్ జంప్ చేయడం తీవ్ర పరిణామాలకు దారి తీస్తుందని వివరించారు.

జేఎల్‌జీ గ్రూపులకు రుణాల అందజేత



మహిళలకు రుణాలు అందజేస్తున్న శరగడం నరసింహమూర్తి

సింహాచలం: పెందుర్తి కోఆపరేటివ్ బ్యాంకులో జేఎల్‌జీ గ్రూప్‌లకు రుణాలను పీఏసీఎస్ ఛైర్మన్ శరగడం నరసింహమూర్తి శుక్రవారం అందజేశారు. తొమ్మిది గ్రూపులకు రూ.11 లక్షల రుణాలు మంజూరు చేశారు. ఈ సందర్భంగా నరసింహమూర్తి మాట్లాడుతూ ఐదుగురు మహిళలు కలిసి గ్రూపుగా ఏర్పడితే జేఎల్‌జీ గ్రూపు(జాయింట్ లైబ్రరీ గ్రూప్) గుర్తించడం జరుగుతుందన్నారు. ఈసారి ఏడు కొత్త జేఎల్‌జీ గ్రూపులకు రూ.లక్ష చొప్పున ఏడు లక్షలు, రెండో సారి రెండు గ్రూపులకు రూ.2 లక్షల చొప్పున అందించడం జరిగిందన్నారు. పెందుర్తి మండలంలో 24 గ్రామాలతో పాటు అర్బన్ ప్రాంతాల్లో పెందుర్తి కోఆపరేటివ్ సొసైటీ విస్తరించి ఉందన్నారు. ప్రజలంతా సొసైటీ సేవలను వినియోగించుకోవాలని కోరారు. బంగారు వస్తువులపై అతి తక్కువ వడ్డీతో రుణాలు అందించడం జరుగుతోందన్నారు.

ఓటుతో ప్రజాస్వామ్యం బలోపేతం



మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

సబ్బవరం: ఓటు హక్కు వినియోగంతో ప్రజాస్వామ్యం మరింత బలోపేతం అవుతుందని విశాఖ ఆర్డీవో,పెందుర్తి నియోజకవర్గ ఈఆర్‌వో హుస్సేన్ సాహెబ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ఓటు నమోదుపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు ద్వారా పాలకులను ఎన్నుకునే హక్కు రాజ్యాంగం కల్పించిందన్నారు. ఓటు ప్రజాస్వామ్యంలో వజ్రాయుధం వంటిదని,18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలని పిలుపునిచ్చారు. ఓటరుగా చేరేందుకు ఫారం-6ను పూర్తిచేసి బీఎల్‌వోకు అందజేయవచ్చని సూచించారు.కార్యక్రమంలో తహసీల్దార్ బి.సత్యనారాయణ,డిప్యూటీ తహసీల్దార్ వెంకట్, ఆర్ఐ వీరయ్య, వీఆర్వో రుక్మిణి తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు



స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: ప్రజా సమస్యలు తెలుసుకుని వాటిని పరిష్కరించడంతో పాటు అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించే లక్ష్యంతో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. పెందుర్తి మండలంలోని గుర్రంపాలెం గ్రామంలో శుక్రవారం ఎమ్మెల్యే గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. అలాగే జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అందుతున్న సేవలను వివరించారు. వచ్చే ఎన్నికల్లో కూడా జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ ఉప్పిలి దేవి, సర్పంచ్ ఉగ్గిన గోవింద్, ఎంపీటీసీ ముదపాక శివ, పార్టీ నాయకులు సుకవాసి సతీష్, అక్కిరెడ్డి వెంకటరమణ, సారిపల్లి గణేష్, గొర్లె రామునాయుడు, సియ్యాద్రి బాలచంద్ర, ఉగ్గిన నాగార్జున తదితరులు పాల్గొన్నారు.